ఈకేవైసీ చేయకుంటే.. రేషన్ కట్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాల్లోని లబ్ధిదారులను తగ్గించేందుకు అనేక సర్వేలను నిర్వహిస్తోంది. ఇప్పటికే దివ్యాంగులకు ఇచ్చిన సర్టిఫికెట్‌లపై సమీక్ష చేయించింది. తాజాగా రేషన్ కార్డుల్లో ఉన్న యూనిట్లను తగ్గించి, రేషన్ బియ్యం మిగుల్చుకోవడానికి కుట్ర చేస్తోంది. కార్డుల్లో ఉన్న ప్రతి లబ్ధిదారుడూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. ఈకేవైసీ చేయకపోతే ఏప్రిల్ రేషన్ ఇవ్వడం జరగదని ప్రచారం చేస్తోంది. రేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబాన్ని ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈకేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఈకేవైసీ అవసరం లేదు. మిగిలినవారు డీలర్లు, వీఆర్‌ఓలు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈకేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. –నగరి

- ఈ నెల 31వ తేదీతో ముగియనున్న గడువు
- ఆందోళనలో రేషన్ కార్డుదారులు
- గడువు పొడిగించాలంటూ వేడుకోలు




విజయపురంలో ఈకేవైసీ చేసుకుంటున్న లబ్ధిదారు, నగరిలో ఈకేవైసీ చేసుకుంటున్న లబ్ధిదారుడు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. ఉన్న పథకాలను కత్తిరిస్తోందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు బియ్యం కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని మండిపడుతున్నారు. పేదల పొట్టకొట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. నెలకు ఒక్కో యూనిట్‌కు 5 కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారని, ఇదే ప్రభుత్వానికి భారమైందా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈకేవైసీ పూర్తికాని వారికి కూడా బియ్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఉపాధి, విద్య, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఈకేవైసీ విషయంపై ఆందోళన చెందుతున్నారు. ఏ గ్రామంలో రేషన్ కార్డు ఉందో ఆ గ్రామానికి వచ్చి ఈకేవైసీ చేసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు ఎలా వస్తారని కుటుంబ సభ్యులు అంటున్నారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. దూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో పిల్లలు చదువుతున్నారు. వారు పరీక్షలు రాసి ఇంటికి చేరుకునేలోపు గడువు ముగిసిపోతే తాము ఎలా ఈకేవైసీ చేసుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు మరింత గడువు ఇవ్వాలని కోరుతున్నారు. మరోపక్క ఈకేవైసీ పూర్తి చేయాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు.

రేషన్ కార్డులు, లబ్ధిదారుల వివరాలు

మండలం	రేషన్ షాపులు	కార్డులు	గోదాములు
నగరి	66	26562	1
నిండ్ర	28	8769	
విజయపురం	33	5966	
పుత్తూరు	42	20045	1
వడమాలపేట	35	9796	
మొత్తం	204	71138	2

ఈకేవైసీ గడువు పెంచాలి



ఉపాధి, విద్య, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఈకేవైసీ విషయమై ఆందోళన చెందుతున్నారు. వెనువెంటనే ఈకేవైసీ చేసుకోవాలంటే వారు ఎలా చేసుకోవాలి. ఈ నెల 31వరకే గడువు అంటే పలువురు ఈకేవైసీ చేయించుకోలేరు. పేదలకు బియ్యం కట్ అవుతుంది. ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని గడువు పెంచాలి. –టీకే హరి, నగరి

ఈకేవైసీ చేసుకోవాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీలోగా రేషన్ కార్డుల్లో ఉన్న లబ్ధిదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్‌ఓల వద్ద వేలిముద్రలు వేయని వారు తప్పక వెళ్లి వేలిముద్రలు వేసుకోవాలి.
–ధనుంజయులు, ఇన్‌చార్జి తహశీల్దార్, నగరి

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



తిరుమలయ్యపల్లెలో బోరు వేయిస్తున్న సర్పంచ్ భారతి, నేతలు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ బాలు పల్లె గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక సర్పంచ్ భారతి, ఎంపీటీసీ సభ్యురాలు హరి చొరవ తీసుకున్నారు. గ్రామంలో నీటి కొరత ఉన్న నేపథ్యంలో స్థానికులు సమస్యను ఎంపీపీ నాగరాణి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపీపీ స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయడంతో బోరు వేయించారు. తిరుమలయ్యపల్లె ఆదిఆంధ్రవాడలో పంచాయతీ నిధులతో కొత్తగా బోరు వేసి నీటి కొరతను నివారించినట్లు సర్పంచ్ తెలిపారు. బోర్లలో నీళ్లు పుష్కలంగా రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, శివారెడ్డి ఉన్నారు.

పన్ను చెల్లింపులకు నాలుగు రోజులే గడువు



మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి: ఈ ఆర్థిక సంవత్సరానికి పన్ను చెల్లింపునకు నాలుగు రోజులే గడువుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరం ఈ నెల 31 తో ముగియనున్నందున పురపాలక సంఘం పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీస్థలం పన్ను, మంచినీటి కుళాయి చార్జీలను బకాయిదారులు వెంటనే చెల్లించాలన్నారు. మొండి బకాయిదారులకు వడ్డీలో 50 శాతం తగ్గింపు ఉన్నందున ఈ అవకాశాన్ని వారు వినియోగించుకొని బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. లేకుంటే మున్సిపల్ చట్టాలను అనుసరించి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నులు చెల్లించుటకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లో, పట్టణంలోని 17 వార్డ్ సచివాలయాల్లో చెల్లించవచ్చన్నారు.

సమష్టి కృషితోనే సారా కట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

నగరి: సమష్టి కృషితోనే సారా కట్టడి సాధ్యమని డీఎస్పీ మహమ్మద్ సయ్యద్ అజీజ్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి నిర్వహించిన నవోదయం 2.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి మున్సిపల్, మండల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో నాటు సారా తయారీ ఉందని దాన్ని అదుపు చేయడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గ్రామస్థాయి అధికారుల నుంచి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి సమష్టిగా కృషి చేస్తేనే సారా సమగ్ర నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. సారా తయారీ, అమ్మకాలే జీవనోపాధిగా కలిగిన వారికి సబ్సిడీ లోన్లు ఇచ్చి ఇతర వృత్తుల్లోకి మళ్లిస్తామని, వారిలో మార్పు తీసుకువస్తామని పేర్కొన్నారు. నాటు సారా రహిత గ్రామంగా తయారవడానికి తమ వంతు కృషి చేస్తామని యువత, గ్రామ పెద్దలతో ప్రతిజ్ఞ చేయించారు. నాటు సారాయి తయారీ, అమ్మకాలపై టోల్ ఫ్రీ నెంబర్ 14405కు గానీ 9440902549 నెంబరుకుగానీ సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కో–ఆప్షన్ సభ్యురాలిగా నసీమా



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): కో–ఆప్షన్ సభ్యురాలిగా పెనుమూరుకు చెందిన నసీమా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో కో–ఆప్షన్ సభ్యుడిగా పనిచేసిన మురాద్ అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఆయన భార్య నసీమాను కో–ఆప్షన్ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీపీ మహాసముద్రం హేమలతారెడ్డి నసీమా పేరును ప్రతి పాదించడంతో 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఆమోదం తెలిపారు. ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ నూతన కో–ఆప్షన్ సభ్యురాలితో ప్రమాణం చేయించారు. ఎంపీపీ హేమలతారెడ్డి, ఎంపీటీసీలు యశోదారెడ్డి, సుభాషిణి, కుసుమకుమారి, సుబ్రమణ్యంరెడ్డి, శివలింగం, వైస్ ఎంపీపీ కోదండన్, పళణి, జమున, సుజాత శాలువాలు కప్పి సన్మానించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ దొరస్వామి, దూది మోహన్, దూది శంకర్, గోవిందరెడ్డి, దేవరాజులురెడ్డి, పయణి, హరికృష్ణ, నీలా పండరీనాథ్, దాము తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి

నగరి: ప్రతి గ్రామ పంచాయతీలో ఇతర పాఠశాల నుండి 3, 4, 5 తరగతులను తరలించకుండా ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. గురువారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన నగరి పట్టణంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కనీసం 3వ వంతు పాఠశాలలు మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుచేసి 5 తరగతులకు ఐదుగురు టీచర్లను తప్పనిసరిగా నియమించాలన్నారు. అందుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్లో కేటాయించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం అమలుచేసి సీపీఎస్ రద్దు చేయాలన్నారు. జిల్లా సహాధ్యక్షుడు కె. రెడ్డెప్ప నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.దీనావతి, రాష్ట్ర కౌన్సిలర్లు పీఆర్ మునిరత్నం, కుప్పరాజు, జిల్లా ప్రచురణ కమిటీ కన్వీనర్ బాలాజీ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కె.వంశీ కృష్ణ సి.వెంకటేశులు పాల్గొన్నారు.

పీబీపీబీ పథకాన్ని అమలు చేయాలి



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనురాధ

పాలసముద్రం: కేంద్ర మహిళా, శిశు సంక్షేమం కోసం పోషణ బీ పడాయి బీ పథకాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ తెలిపారు. మండలంలో ఎమ్మార్సీ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం శిక్షణ కార్యక్రమం ముగిసింది. అనురాధ మాట్లాడుతూ పీబీపీబీ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. పిల్లలకు చిన్నతనంలోనే జ్ఞానాన్ని పెంపొందించి పాఠశాల స్థాయిలో చదువులపై ఆసక్తి కల్పించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్న పిల్లలకు అంగన్‌వాడీలో మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించాలన్నారు. తద్వారా చిన్నపిల్లల్లో సృజనాత్మక శక్తితోపాటు ఆటపాటల్లో ప్రతిభ కనబరుస్తారన్నారు. కార్యకర్తలు శిక్షణపై నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

నగరి: మున్సిపల్ పరిధి చింతలపట్టెడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం సీడీపీఓ కృష్ణవేణి పోషణ్‌బీ..పడాయిబీపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆరేళ్ల కంటే తక్కువ వయస్సు గల చిన్నారుల అభివృద్ధి నిర్ధారించే పద్ధతులు వివరించారు. మానసిక ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరచడాన్ని వివరించారు. సూపర్‌వైజర్లు శంకరమ్మ, శ్యామ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆరున్నర నెలలకే ప్రసవం!

–అత్యాధునిక వైద్యంతో ప్రాణం పోశారు



వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్

గుడుపల్లె: సాధారణంగా మహిళలు గర్భం దాల్చితే 9నెలలు తర్వాత ప్రసవించడం సహజం. అయితే ఆరున్నర నెలలకే ప్రసవిస్తే..శిశువు అతి తక్కువ బరువుతో పుడితే ప్రసవం, శిశు సంరక్షణ ఒకింత రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమే. అయితే అత్యాధునిక వైద్య చికిత్సతో ఓ గర్భిణికి ఈ తరహాలో కాన్పు చేసి, తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పీఈఎస్ వైద్యులు కాపాడారు. పీఈఎస్ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ సుబ్రమణ్య గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలిపిన వివరాలు..చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం జంగాలపల్లెకు చెందిన రోషిణి కాన్పు నిమిత్తం జనవరి 18న పీఈఎస్ ఆసుపత్రిలో అడ్మిట్ అయిందన్నారు. ఆమెకు వైద్య పరీక్షలు చేశారు. డెలివరీకి మామూలుగా 40 వారాల సమయం ఉండాలి. అయితే రోషిణికి 27 వారాలు మాత్రమే కావడంతో వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి డెలివరీ చేశారు. రోషిణి మగశిశువుకు జన్మనివ్వడం, ఆ శిశువు బరువు 740 గ్రాములు మాత్రమే ఉండడంతో మూడు నెలలుగా ప్రత్యేక వైద్యం అందించారు. ఇప్పుడు 1.50 కిలోల బరువు వచ్చిందని వైద్యులు నిర్ధారించారన్నారు. వైద్యం అందించిన హరిచంద్ర, దీప్తి బృందాన్ని సూపరింటెండెంట్ అభినందించారు.

మెడికల్ షాపుల తనిఖీ

- నకిలీ మందులు సీజ్



నకిలీ మందులను సీజ్ చేస్తున్న అధికారులు

పుత్తూరు: పట్టణంలోని పలు మందుల షాపుల్లో తిరుపతి జిల్లా డ్రగ్స్ ఆఫీసర్ రుతు గురువారం తనిఖీలు నిర్వహించారు. సెంగుంధర్ వీధిలోని హోమియోపతి క్లినిక్‌లోని నకిలీ మందులను గుర్తించారు. వీఆర్‌ఓతో పంచనామా నిర్వహించి సీజ్ చేశారు. సదరు క్లినిక్ నిర్వాహకులను 7 రోజులపాటు షాపును తెరవరాదని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షణ్ముగ హోమియోపతి క్లినిక్‌లో డ్రగ్స్, మ్యాజిక్ రెమెడీస్ చట్టం(అభ్యంతరకరమైన ప్రకటనలు) 1954 చట్టం కింద మందులను సీజ్ చేశామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు నివేదిస్తామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కాలం చెల్లిన మందులు విక్రయించడం నేరమని అలా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులకు మందులు కొనుగోలు చేసినప్పుడు షాపు యజమానులు విధిగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ యశోద, ప్రభుత్వ ఆసుపత్రి ఫార్మాసిస్ట్ అన్నాదొరై పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారు

నిండ్ర: మండలంలోని కేఆర్‌పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రం ఆవిష్కరణ



కరపత్రం విడుదల

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ ఆహ్వాన కరపత్రికను విడుదల చేశారు. ఆలిండియా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పూడి జయంత్ బాబు ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ జరీనా చేతుల మీదుగా విడుదల చేశారు. పి.దేవరాయులు, కె.బాల, డి.సుబ్రమణ్యం, గురవయ్య, సాయి ప్రకాష్, డి.హేమావతి, పి.మునిశేఖర్, డి.వినోద్, జయచంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీగా కన్నెమ్మ




వైస్ ఎంపీపీని అభినందిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, వైస్ ఎంపీపీతో కుమారస్వామిరెడ్డి తదితరులు

విజయపురం: విజయపురం మండల వైస్–ఎంపీపీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి కన్నెమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉన్న వైస్ ఎంపీపీ ప్రభుత్వ ఉద్యోగం వచ్చి వెళ్లిపోవడంతో ఆ పదవికి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికకు 8 మంది ఎంపీటీసీలకు ఏడుగురు హాజరయ్యారు. అందరూ కోసలనగరం ఎంపీటీసీ కన్నెమ్మను ఏకగ్రీవంగా ప్రతిపాదించడంతో ఆమెకు వైస్ ఎంపీపీ పీఠం దక్కింది. రిటర్నింగ్ అధికారి భవానీశంకరి కన్నెమ్మకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఆమెకు మాజీ మంత్రి ఆర్కే రోజా అభినందనలు తెలిపారు. ఆమె ఆదేశాల మేరకు ఆమె సోదరులు వై.కుమారస్వామిరెడ్డి నూతన వైస్ఎంపీపీని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ బాలాజీ, రాష్ట్ర రైతు విభాగం సభ్యుడు గుణశేఖర్‌రెడి, గోవర్ధన్ నాయుడు, కన్వీనర్ శివరాజు, ఎంపీటీసీలు డి.రాజ్ గోపాల్, సరళ, అంబిక, గోవిందమ్మ, సర్పంచ్ మురళీరెడ్డి, ప్రసన్న, భాస్కర్‌రాజు, నాయకులు పాండి, చెంచువరప్రసాద్, ప్రతాప్, సతీష్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు వారపు సంత వేలం



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న హరిబాబు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని జీడీ నెల్లూరు గ్రామ సచివాలయంలో గురువారం వారపు సంత వేలంలో పంచాయతీకి 5.37 లక్షలు ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పీఓ పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ పార్వతి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, పంచాయతీ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో రూ.5.10 లక్షలకు వైస్ ఎంపీపీ హరిబాబుకు వారపు సంతను వేలంలో కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వారపు సంత కాల పరిమితి ఏప్రిల్ 1వ తేదీ నుండి 2026 మార్చి 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పంచాయతీ కాంప్లెక్స్ రూముకు మల్లీశ్వరి రూ.27 వేలుకు వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు.

చెరువు బహిరంగ వేలం

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పంచాయతీ ముక్కల చెరువును శుక్రవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు కార్యదర్శి జ్యోత్స్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వరదమ్మ అధ్యక్షతన, మండల స్థాయి అధికారుల సమక్షంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ముక్కల చెరువు వేలం పాట నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.2000 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని అన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా అందించాలి



మాట్లాడుతున్న తహశీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం: ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు సకాలంలో సక్రమంగా అందించాలని తహశీల్దార్ అరుణ కుమారి, సీఎస్‌డీటీ మోహన్‌రాజు తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ అరుణ కుమారి మాట్లాడుతూ డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించి నిత్యావసర సరుకులు అందించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కార్డుదారులతో ఈకేవైసీ తప్పక చేయాలని సూచించారు. సీఎస్‌డీటీ మోహన్‌రాజా మాట్లాడుతూ తూకాల్లో తేడాలు లేకుండా సంబంధిత వీఆర్‌ఓలు పర్యవేక్షించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో గోడౌన్ టీటీ కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రిషివర్మ, ఎంఆర్ఐ దేవి, డీలర్లు పాల్గొన్నారు.